# గ్రూప్-1 పరీక్షను రద్దు చేయండి



**ప్రిలిమినరీ, మెయిన్స్ మళ్లీ నిర్వహించాలి • సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ**
**నియామకాల్లో అంతటా అవకతవకలు • యువత జీవితాలతో సర్కార్ చెలగాటమా?**
**పరీక్షలు, ఫలితాల వెల్లడిలో అనేక సందేహాలు • హైకోర్టు తీర్పు హర్షణీయం : కవిత**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దుచేసి, అన్ని పరీక్షలు మళ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలను రద్దుచేసి, తిరిగి నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. గ్రూప్-1పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆమె రాసిన ఈ లేఖ ద్వారా గ్రూప్-1లో పరీక్షలు, ఫలితాలపై అభ్యర్థులు వ్యక్తంచేస్తున్న అనుమానాలు, సందేహాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రూప్-1 నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగుల జీవితాలు అగాథంలో పడ్డాయని మండిపడ్డారు. నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిన విషయం తేటతెల్లమైందని పేర్కొన్నారు. యువత జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడటం ఆక్షేపనీయమని పేర్కొన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరు హాల్‌టికెట్లను జారీచేయడంతోనే గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. 21,075 మంది మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని టీజీపీఎస్సీ ప్రకటించిందని, కానీ ఫలితాలు ప్రకటించే నాటికి అభ్యర్థుల సంఖ్య 21,085 మందికి చేరిందని, దీంతో అదనంగా ఆ 10 మంది అభ్యర్థుల సంఖ్య ఎలా పెరిగిందంటూ ప్రశ్నించారు. ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్షకు హాజరయ్యారని తొలుత ప్రకటించిన టీజీపీఎస్సీ, తర్వాత ఆ సంఖ్య 10కి ఎలా చేరిందని నిలదీశారు. పరీక్ష నిర్వహణలో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేసినా, అభ్యర్థుల హాజరు విషయంలో ఎందుకు వ్యత్యాసాలు వచ్చాయని ప్రశ్నించారు.

### మెయిన్స్ మూల్యాంకనంపై సందేహాలు

గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని కవిత ఆ లేఖలో పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ వర్సిటీల ప్రొఫెసర్లతో మెయిన్స్ పరీక్షల వాల్యూయేషన్ చేయిస్తామని తొలుత టీజీపీఎస్సీ ప్రకటించిందని, కానీ రిటైర్డ్ ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించడంపైనా అభ్యర్థుల్లో అనుమానాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిన కమిషన్.. ఆ తర్వాత మాట మార్చి, ఒక సెంటర్‌ను పెంచిందని తెలిపారు. కేవలం రెండు పరీక్ష కేంద్రాల్లోనే మెయిన్స్ పరీక్షలకు హాజరైన, రెండు కోచింగ్ సెంటర్లకే చెందిన 71 మంది అభ్యర్థులు గ్రూప్-1 ఉద్యోగాలకు అర్హత సాధించడం వెనుక ఏదో మతలబు ఉన్నదని అనుమానం వ్యక్తంచేశారు. అభ్యర్థుల ఆందోళన ధర్మబద్ధంగానే ఉన్నదని హైకోర్టు కూడా గుర్తించిందని, ఆ నియామకాలపై స్టే విధించిందని ఆమె పేర్కొన్నారు.

## సీబీఐ విచారణ జరపాలి

- **గ్రూప్-1పై హైకోర్టు తీర్పు సర్కారుకు చెంపపెట్టు**
- **తమవాళ్లతో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు యత్నం?**
- **బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆరోపణలు**



హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు, ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు గ్రూప్-1 ఉద్యోగాలను తమ వాళ్లతో భర్తీ చేసుకోవాలని చూశారని, అందులో భాగంగానే పరీక్షల నిర్వహణ, ఫలితాల్లో ఈ గోల్‌మాల్ జరిగిందని విమర్శించారు. గ్రూప్-1 అవకతవకలపై హైకోర్టుకు వెళ్లిన అభ్యర్థుల పక్షాన తీర్పు వెలువడటంతో వారి అనుమానాలకు బలం చేకూరిందని చెప్పారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. ఇది గ్రూప్-1 అభ్యర్థుల పోరాట ఫలితమని, బీఆర్ఎస్ పార్టీకి నైతిక విజయమని అభివర్ణించారు. అంతిమ విజయం ఎప్పుడూ ధర్మానిదే అని మరోసారి నిరూపితమైందని అభిప్రాయపడ్డారు. గ్రూప్-1 అవకతవకలపై ప్రశ్నించిన తనకు టీజీపీఎస్సీ నోటీసులిస్తే.. హైకోర్టు మాత్రం టీజీపీఎస్సీకే నోటీసులు ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బుల్లింగ్, బుల్డోజ్, బ్లాక్‌మెయిల్ వంటి 3 నియమాలను మాత్రమే నమ్ముకున్నట్టుగా ఉన్నదని ధ్వజమెత్తారు. గ్రూప్-1పై వేసిన కేసులను తుంగలో తొక్కిస్తా అంటూ అహంకారపూరితంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని తెలిపారు. ఇదే విషయంపై కోర్టు ఆయనకే మొట్టికాయలు వేసిందని తెలిపారు. పరీక్షలకు హాజరైన వారికంటే.. విడుదలైన ఫలితాల్లో 10 మంది అదనంగా ఎలా పెరిగారని హైకోర్టు ప్రశ్నిస్తే.. దానికి సమాధానంగా 'సర్వసాధారణమే' అనడం టీజీపీఎస్సీ నిర్లక్ష్యానికి అద్దం పట్టినట్టుగా ఉన్నదని ధ్వజమెత్తారు. మహిళా యూనివర్సిటీలో కేవలం మహిళలకు మాత్రమే ఎందుకు సెంటర్ ఏర్పాటుచేశారని హైకోర్టు ప్రశ్నించినా, టీజీపీఎస్సీ సరైన సమాధానమే ఇవ్వలేకపోవడం దారుణమని పేర్కొన్నారు. 18, 19 నంబర్లు గల ఆ రెండు పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థులే ఎలా ఎంపికయ్యారు? అని ప్రశ్నించారు.

### అభ్యర్థులకు హైకోర్టులోనే బ్లాక్‌మెయిల్

గ్రూప్-1పై కేసులు దాఖలు చేసిన అభ్యర్థులను సాక్షాత్తు హైకోర్టులోనే బ్లాక్‌మెయిల్‌కు, బెదిరింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే కోర్టు చేత మొట్టికాయలు వేయించుకున్న ఏకైక ప్రభుత్వం బహుశా ఇదేనని దుయ్యబట్టారు. ఈ కేసు గెలిచేదాకా గ్రూప్-1 అభ్యర్థుల తరపున న్యాయస్థానంలో కొట్లాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు.

# పరీక్ష మళ్లీ నిర్వహించాలి

- **గ్రూప్-1 పోస్టులు అమ్ముకున్నారు!**
- **జీవో 55ను అమలు చేయండి**
- **కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది**
- **భగ్గుమన్న గ్రూప్-1 అభ్యర్థులు**
- **దద్దరిల్లిన ఇందిరాపార్క్ ధర్నాచౌక్**
- **సీబీఐ విచారణ జరపాలి: కృష్ణయ్య**
- **గ్రూప్ 1 అభ్యర్థుల ధర్నాకు మద్దతు**




హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్18,(నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1ను రద్దు చేసి మళ్లీ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షలో జరిగిన అన్యాయంపై శుక్రవారం 'హలో టీజీపీఎస్సీ లోపాలను సరిదిద్దుకో-గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం చేయకు' నినాదంతో హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని తమకు న్యాయం చేయాలంటూ పెద్దపెట్టున నినదించారు. నిరుద్యోగ యువత నినాదాలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా వారు తమ ఆవేదన వ్యక్తంచేశారు. టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో పోస్టులను కోట్లాది రూపాయలకు అమ్ముకున్నారనే అనుమానాలు ఉన్నాయని, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. మాధ్యమాల వారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను బయట పెట్టాలని నినాదాలు చేశారు.

### సీబీఐ విచారణ జరపాలి: ఆర్ కృష్ణయ్య

గ్రూప్-1 పరీక్షలు, ఫలితాల్లో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ కమిటీ వేయాలని, సీబీఐతో విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ధర్నా చౌక్ వద్ద గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. 1,500 మంది పరీక్ష రాసిన రెండు సెంటర్లలో 24 మందికి టాప్ ర్యాంకులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ కలిసి అభ్యర్థులు అడుగుతున్న న్యాయమైన ప్రశ్నలకు బహిరంగంగా సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. 30 మందికి ఒకే ర్యాంక్ ఎలా వస్తుందని అనుమానం వ్యక్తంచేశారు. ఇంగ్లిష్ మీడియం వాళ్లు అర్హత సాధించి, తెలుగు మీడియం వాళ్లు అర్హత సాధించకపోవడం వెనుక ఉన్న కుట్రలను బయటికి తీయాలని కోరారు. గ్రూప్-1 పరీక్ష పేరుతో రూ.కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. జీవో 29తో ఎస్సీ, బీసీ బిడ్డలకు అన్యాయం చేశారని, ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

### 200కు పైగా తప్పులు: జనార్దన్

13 ఏండ్ల తర్వాత నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రకరకాలుగా మలుపులు తిరుగుతున్నదని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. ఈ పరీక్షల్లో 200కు పైగా తప్పులు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. అయినా కూడా ప్రిలిమ్స్ నుంచి ఇంటర్వ్యూ దశకు చేరిందని, ఈ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

### రీవాల్యుయేషన్ చేయాలి : దామోదర్‌రెడ్డి

తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని గ్రూప్-1 అభ్యర్థి దామోదర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. టాప్-5లో ఒక్కరూ తెలుగు మీడియం అభ్యర్థి లేరని తెలిపారు. ఒకే పరీక్ష కేంద్రంలో 65 మంది అర్హత ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా కాంగ్రెస్ పాలనలో వాళ్లకు కావాల్సిన వారికే ఉద్యోగాలు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. మూల్యాంకనం చేసిన వారి పేర్లను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ గ్రూప్-1 పేపర్లను వెబ్‌సైట్‌లో పెట్టాలని, తాము అడుగుతున్న రీవాల్యుయేషన్‌కు అవకాశమివ్వాలని కోరారు.

## లోకం పోకడ




నాన్ అమెరికన్ సార్.. ఇప్పటికి పదిసార్లు తుమ్మాడు.. వాతావరణం పొల్యూట్ అవుతున్నది.. వీసా రద్దు చేసి పారేద్దామా?

## తులం బంగారం సాధ్యం కాదు

మొదటిపేజీ తరువాయి...

కష్టంగానే ఉందని చెప్పారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ త్వరలోనే రాబోతున్నదని చెప్పారు. విమానాశ్రయం కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పరిస్థితి డోలాయామానంలో ఉందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఎవరికీ రూపాయి ఇవ్వొద్దని, అర్హులకు అందేలా కృషి చేస్తానని మాటిచ్చారు.

## ఎస్జీటీ పదోన్నతుల్లో జోక్యం చేసుకోలేం

**స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీపై హైకోర్టు స్పష్టీకరణ**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం ద్వారా చేపట్టిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా ఎంత నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని స్పష్టం చేసింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో 1999 నాటి జీవో 108 అమలును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎస్జీటీల పదోన్నతులు, ప్రత్యక్ష నియామకాలకు సంబంధించి దేవేశ్‌శర్మ వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను అమలు చేయడంలేదని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో పదోన్నతుల ద్వారా ఎస్జీటీలకు 20 శాతంలోపు లభించేలా, మిగిలిన పోస్టులన్నీ ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేసేలా చూడాలని కోరారు. ఖాళీలను నోటిఫై చేసి డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ప్రత్యక్ష నియామకాల ద్వారా 33.33%, ఎస్జీటీలకు పదోన్నతులు, బదిలీల ద్వారా 66.66% భర్తీ చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయమని, ఆ నిష్పత్తిని మార్చాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించలేమని స్పష్టం చేసింది. పిటిషనర్లు తమ అభ్యర్థనను వ్యక్తిగతంగా లేదా ప్రతినిధి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లొచ్చని పేర్కొంటూ.. పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

### రేపు బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్18 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సంబంధించి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి సైదులు ప్రకటనలో తెలిపారు. మొత్తం 6,832 బ్యాగ్ లాగ్ సీట్లుండగా, 26,884 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు రాష్ట్రవ్యాప్తంగా 109 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

# ఇది ప్రజాపాలనా.. పోలీసుపాలనా?

- **పోలీసులే కొట్టి, ఉల్టా కేసులు పెడ్తరా?**
- **అక్రమ కేసులతో.. భయపెట్టలేరు**
- **రెట్టింపు ఉత్సాహంతో పోరాడుతాం**
- **మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



పోలీసులు కొట్టడంతో కార్యకర్తలకు తగిలిన దెబ్బలను చూపిస్తున్న మాజీ మంత్రి వేముల

మోర్తాడ్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలనా.. పోలీసుపాలనా? అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే తట్టుకోలేక ప్రభుత్వ పెద్దలు పోలీసులను ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. మమ్మల్నే కొడతారు.. పైగా మామీదే కేసులు పెడుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు, లాఠీ దెబ్బలతో బీఆర్ఎస్ శ్రేణులను భయపెట్టలేరని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో రెండ్రోజుల క్రితం జరిగిన పోలీసుల లాఠీచార్జి, అక్రమ కేసులు తదితర పరిణామాలను ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు.

**ఆయన మాటల్లోనే..**

'కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజాపాలన తెస్తమన్నరు, కానీ పోలీస్, రాక్షస పాలన నడిపిస్తుండ్రు. భీమ్‌గల్‌కు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు ప్రభుత్వం ఇస్తానన్న తులం బంగారం ఎప్పుడిస్తారని అడిగినం. పెన్షన్లు ఎప్పుడు పెంచుతారని, సంపూర్ణ రుణమాఫీ ఎప్పుడు చేస్తారని మంత్రిని ప్రశ్నించాం. సీఎం మార్చి 31 లోపు రైతుభరోసా వేస్తామన్నారు. ఇప్పటికీ రైతుల ఖాతాలో ఆ డబ్బులు ఎందుకు జమకాలేదని అడిగినం. మిగతా హామీలు ఎప్పుడు అమలు చేస్తారని మంత్రిని అడుగుతుంటే కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. హామీలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను కట్టడి చేసి, కాంగ్రెస్ కార్యకర్తలను ఫ్రీగా వదిలేశారు. పైగా బీఆర్ఎస్ కార్యకర్తలపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారు. హామీలపై మంత్రి జూపల్లిని నిలదీసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టించిండు. కేసులు పెట్టాలంటూ సునీల్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో చెప్పగానే పోలీసులు ఆగమేఘాల మీద.. లాఠీచార్జిలో దెబ్బలు తిన్నవారిపై, నాతోపాటు 33 మందిపై అక్రమకేసులు పెట్టిండ్రు. పోలీసులే కొడ్తరు.. ఉల్టా కేసులు పెడ్తరు. ఇదేం పాలన? మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడగడం ప్రతిపక్షపార్టీగా మా బాధ్యత. అందులో తప్పేముంది? కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రభుత్వ పెద్దలు, పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా మా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. మీరు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేదాకా రెట్టింపు ఉత్సాహంతో, కసితో పోరాటం చేస్తూనే ఉంటాం. మా పోరాటానికి బాల్కొండ నియోజకవర్గ ప్రజలు, మహిళలు, రైతన్నలు అండగా నిలుస్తారు' అని పేర్కొన్నారు.




# మూడోసారి విచారణకు క్రిశాంక్

- **23న నాలుగోసారి హాజరుకావాలని నోటీసులు ఇచ్చిన పోలీసు అధికారులు**
- **విచారణ పేరిట రేవంత్ సర్కార్ వేధింపులకు పాల్పడుతున్నది : క్రిశాంక్**

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 18: కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఏఐ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ మూడోసారి విచారణ కోసం శుక్రవారం గచ్చిబౌలి పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచారణ పేరిట రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నదని, ఎట్టిపరిస్థితిలో భయపడేది లేదని తెలిపారు. ఇప్పటికే మూడుసార్లు విచారణకు పిలిచినా ఒరిగిందేమీ లేదని, ఈ నెల 23న నాలుగోసారి విచారణకు రావాలని మళ్లీ నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. విచారణలో అడిగిందేమీ లేదని, కాలయాపన కోసమే ఇందంతా చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల్లో పాల్గొనకుండా ఇబ్బందులు పెడుతున్నట్టు ఆరోపించారు.

# 'గిగ్' బిల్లు గో బ్యాక్

- **రాహుల్ మెప్పుకోసమే ముసాయిదా బిల్లును రూపొందించారు**
- **మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు బిల్లులో లేకపోవడం దారుణం**
- **ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలపై రేవంత్ ఎందుకు స్పందించరు?**
- **ఈనెల 22న ఇందిరాపార్క్ వద్ద ధర్నా**
- **తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు దయానంద్ ఆగ్రహం**



హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలోని 20 లక్షల మంది రవాణారంగ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు దయానంద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదంటూ నిలదీశారు. రాహుల్‌గాంధీ మెప్పుకోసమే గిగ్ వర్కర్ల ముసాయిదా బిల్లు రూపొందించాలని సీఎం రేవంత్ తహతహలాడుతున్నారని విమర్శించారు. ఆ బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు 'నమస్తే తెలంగాణ'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మాటిచ్చిందని.. అందుకోసం సీఎం, మంత్రుల దృష్టికి సైతం తీసుకెళ్లామని, కానీ ఫలితం లేదని వాపోయారు. ట్రేడ్ యూనియన్లను సంప్రదించకుండా ప్రభుత్వం గిగ్‌వర్కర్ల ముసాయిదా బిల్లుపై ముందుకుపోవడం సరికాదని మండిపడ్డారు. ఏడాదిన్నరగా డ్రైవర్ల సమస్యలను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఓవైపు గిరాకీలేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. కనీసం ఆ చావులపై స్పందించడానికి కూడా సీఎం రేవంత్‌కు సమయం దొరకకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ.12వేల హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన వాడినైనా.. మొదటగా రవాణారంగ కార్మికుడినని పేర్కొన్నారు. ఈనెల 22న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

## 21 నుంచి రైతు మహోత్సవం

- **నిజామాబాద్‌లో మూడు రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణ**
- **వ్యవసాయశాఖ సంచాలకుడు గోపీ వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం నిర్వహించనున్నట్టు వ్యవసాయశాఖ సంచాలకుడు డాక్టర్ బీ గోపీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని స్థానిక జీజీ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే మహోత్సవాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు, వారు పండించిన ఉత్పత్తులతోపాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు సైతం ప్రదర్శనలో ఉంచనున్నట్టు వెల్లడించారు. సుమారు 150 స్టాల్స్ ఏర్పాటుచేయనున్నట్టు వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల అవార్డు గ్రహీతలతో నూతన సాంకేతికత పద్ధతులపై మూడ్రోజులు వర్క్‌షాప్ ఉంటుందని తెలిపారు.

# అత్యాచారయత్నమా... జారిపడిందా?

- **యువతిపై అత్యాచారయత్నం జరగలేదని పోలీసుల నిర్ధారణ**
- **పోలీసులను యువతి తప్పుదోవ పట్టించినట్టు తేలిందని వెల్లడి**
- **రైలులో అత్యాచారయత్నం జరిగింది.. నిందితుడిని గుర్తించా**
- **ఏం జరగలేదని చెప్పించేందుకు పోలీసులు యత్నిస్తున్నారు: యువతి**



హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఎంఎంటీఎస్ రైలులో అత్యాచారయత్నం జరిగిందన్న కేసు కీలక మలుపు తిరిగింది. మార్చి 22న రాత్రి ఏం జరిగిందనే కోణంలో దర్యాప్తు జరిపిన పోలీసులు సంచలన నిర్ధారణకు వచ్చారు. సదరు యువతిపై అత్యాచారయత్నం జరగలేదని, ఆ యువతి పోలీసులను తప్పుదోవ పట్టించిందని తేల్చారు. కానీ తనపై అత్యాచారయత్నం జరిగిందని సదరు యువతి చెప్తుండటంతో కేసుపై సందిగ్ధత నెలకొంది.

### అసలేం జరిగిందంటే!

అనంతపురం జిల్లాకు చెందిన యువతి సిటీలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నది. మార్చి 22న సికింద్రాబాద్‌లో సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకుని, మేడ్చల్‌లోని ఇంటికి తిరిగి వెళ్లేందుకు సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్‌లో రైలు ఎక్కింది. అయితే కొంపల్లి సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గాయపడిన స్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన స్థానికులు ముందుగా గాంధీ దవాఖానకు, ఆ తర్వాత ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న యువతిని రైల్వే పోలీసులు విచారించగా ఆమెపై అత్యాచారయత్నం జరిగిందని తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. యువతి చెప్తున్నట్టుగా రైలులో అత్యాచారయత్నం జరగలేదని పోలీసులు నిర్ధారించారు.

### రీల్స్ తీస్తూ జారిపడింది



ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం జరగలేదు. పోలీసులను సదరు యువతి తప్పుదోవ పట్టించింది. ప్రమాదానికి గురైన సమయంలో ఒక ఫోన్‌లో రీల్స్ చేస్తూ మరో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉందని దర్యాప్తులో తేలింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత యువతి పోలీసులను తప్పుదోవ పట్టించినట్టుగా తేలింది. ఎవరినీ అన్యాయంగా కేసులో ఇరికించవద్దని న్యాయనిపుణులు సలహా ఇచ్చారు. కేసు క్లోజ్ చేసే అంశంపై ఆలోచిస్తున్నాం. **-చందనాదీప్తి, రైల్వే ఎస్పీ**

### అత్యాచారయత్నం జరిగింది

పోలీసులు చేస్తున్న ఆరోపణలు వాస్తవంకాదు. నేను పోలీసులను తప్పుదోవ పట్టించడంలేదు. నాపై అత్యాచారయత్నం జరిగింది. ఆ రోజు రైలు బోగీలో నేను, మరో యువకుడు మాత్రమే ఉన్నాం. అల్వాల్ దాటిన తర్వాత బోగీలో ఉన్న వ్యక్తి నా దగ్గరకు వచ్చి, శారీరకం సంబంధం కోసం అడిగాడు. నేను ఒప్పుకోకపోవడంతో లైంగికదాడికి ప్రయత్నించాడు. అతడి నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో నాకు కొంత సమయం కావాలని చెప్పాను. ఆ తర్వాత డోర్ దగ్గర నిలబడి, కిందకు దూకాను. దవాఖానలో చికిత్స పొందుతున్న సమయంలో కూడా పోలీసుల దర్యాప్తులో నిందితుడిని గుర్తుపట్టాను. **- యువతి**